క్లుప్తంగా

ఉపాధ్యాయులకు ఘన సత్కారం



బదిలీ అయిన ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పాఠశాల సిబ్బంది, విద్యార్థులు

బిక్కవోలు: మండలంలోని మెళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విశేష సేవలు అందించి బదిలీపై వివిధ పాఠశాలకు వెళ్లిన ఐదుగురు ఉపాధ్యాయులను పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. గురువారం ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలోని పాఠశాల హెచ్ఎం జి.లక్ష్మీ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఇక్కడ పని చేసేన కాలంలో పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులు ఉన్నతికి ఎంతో సహకారం అందించారన్నారు. ఈ కార్యక్రమంలోని బదిలీ అయిన ఉపాధ్యాయులు ఎం. శ్రీనివాస్ (ఇంగ్లీష్), ఆలియా బేగం (గణితం), వి.వరప్రసాద్ (ఎస్ఎస్), పి.వి రత్నాచారి(తెలుగు), ఎస్.కామాక్షి(హిందీ) ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలోని ఉపాధ్యాయులు గొలుగూరి వెంకటరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుట్టుశిక్షణతో స్వయం ఉపాధి



కుట్టుశిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడుతున్న ఎంపీడీవో అశోక్ కుమార్

కోరుకొండ: కుట్టు శిక్షణతో మహిళలు స్వయం ఉపాధికి పునాది వేసుకోవాలని ఎంపీడీఓ బత్తిన అశోక్ కుమార్ అన్నారు. కాపవరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రతిరోజూ ఉదయం , మధ్యాహ్నం రెండు దఫాలుగా 144 మంది మహిళలు కుట్టుశిక్షణ పొందుతున్నారు. ఆ కార్యక్రమాన్ని పరిశీలించిన ఎంపీడీవో మాట్లాడుతూ మరో రెండు నెలల పాటు శిక్షణకు సక్రమంగా హాజరుకావాలన్నారు. తద్వారా అవకాశాలు మెరుగుపడతాయన్నారు.

'నన్నయ'కు యూనియన్ బ్యాంకు వితరణ



యంత్రాలతో వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ, బ్యాంకు అధికారులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని క్రీడా మైదానం నిర్వహణకు అవసరమైన డోజర్, డిగ్గర్‌లను క్యాంపస్‌లోని యూనియన్ బ్యాంక్ ఇండియా వితరణగా అందజేసింది. రూ.2,59,600 విలువ చేసే ఈ పరికరాలను వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ గురువారం ఆ బ్యాంకు అధికారులతో కలసి లాంఛనంగా ప్రారంభించారు. క్రీడా ప్రాంగణాన్ని శుభ్రపర్చడానికి, సుందరీకరణకు, మొక్కలు నాటేందుకు సిలిండర్లతో కూడిన ఈ పరికరాలు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో బ్యాంకు రీజినల్ హెడ్ ఎ.మనోజ్, చీఫ్ మేనేజర్ జి.సురేష్, రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు విడుదల



సాగునీటిని విడుదలకు స్విచ్ ఆన్ చేస్తున్న మంత్రి రామానాయుడు

సీతానగరం: పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నుంచి సాగునీటిని గురువారం రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విడుదల చేశారు. ముందుగా గోదావరికి పూజలు నిర్వహించి, మోటారు స్విచ్ ఆన్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, జలవనరుల శాఖ తుని సర్కిల్ ఎస్ఈ బి. ఏసుబాబు, ఎస్ఈ (హెడ్ వర్క్స్) రెడ్డి రామచంద్రరావు, ఈఈ రంగారావు, డీఈ సీహెచ్ కోటేశ్వరరావు, ఏఈఈలు వినోద్, సుమంత్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులకు గురువారం శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. ఎస్పీ నరసింహ కిశోర్ ఆదేశాలతో కోరుకొండ, నార్త్ జోన్ డీఎస్పీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. శక్తి టీమ్ సభ్యులైన ఎం.రామకృష్ణ, డి.అశ్విని, వి.ప్రసాద్ తదితరులు శక్తి యాప్ వల్ల కలిగే ప్రయోజనాలను తెలిపారు. అనంతరం యాప్‌ను విద్యార్థినులతో వారి స్మార్ట్ ఫోన్లలోకి డౌన్‌లోడ్ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇంజినీర్ అవుతా



పదో తరగతిలో 575 మార్కులు సాధించి స్కూల్లో ప్రథమ, మండలంలో ద్వితీయ స్థానంలో నిలిచాను. ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. బాగా చదువుకుని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతాను. అన్ని సబ్జెక్టుల్లో నన్ను నేను మెరుగుపర్చుకోవడానికి మా ఉపాధ్యాయులు బాగా సహకరించారు.

– అంగర వెంకటలక్ష్మి, కొంకుదురు

ఉపాధ్యాయుల ప్రోత్సాహం



పదో తరగతిలో 582 మార్కులు రావడంతో స్కూల్ టాపర్‌గా, మండలంలో మొదటి స్థానంలో నిలిచాను. నాన్న లోవరాజు తాపీ పని చేస్తారు. నూజివీడు ట్రుపుల్ ఐటీలో సీటు వచ్చింది. బాగా చదువుకుని కంప్యూటర్ సైన్స్ ఇంజినీర్ అవుతాను. డిజిటల్ తరగతులు ఎంతో ఉపయోగపడ్డాయి. ఉపాధ్యాయుల ప్రోత్సాహం మరువలేనిది.

– దాసరి జయ మణిమంగ, బిక్కవోలు

ఉన్నత శిఖరాలకు..



కష్టబడి చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నదే నా ఆశయం. పదో తరగతిలో 584 మార్కులు వచ్చాయి. నూజివీడులోని ట్రిపుల్ ఐటీలో సీటు రావడం చాలా ఆనందంగా ఉంది. నా తల్లిదండ్రులు ఎంతో కష్టబడి చదివించారు. నా విజయం వెనుక వెనుక ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఎంతో ఉంది.

– కోశెట్టి శ్యాంకుమార్, రంగంపేట

మట్టిలో మాణిక్యాలు

- సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- 18 మందికి ట్రిపుల్ ఐటీల్లో సీట్లు



ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన అనపర్తి బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు

బిక్కవోలు: ప్రతిభకు పేదరికం అడ్డు కాదని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నిరూపించారు. పదో తరగతిలో ప్రతిభ చూపి, ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సంపాదించి. తమ భవిష్యత్తుకు బంగారు బాట వేసుకున్నారు.పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వీరందరూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలను సద్వినియోగం చేసుకున్నారు. పదో తరగతిలో స్కూల్ టాపర్లుగా నిలిచి ప్రతిష్టాత్మక నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం, కడపలోని ట్రిపుల్ ఐటీల్లో సీటు సాధించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు- నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దింది. ఇంగ్లిష్ మీడియం బోధన, ట్యాబ్‌లు, డిజిటల్ క్లాసులు, మౌలిక సదుపాయాలు కల్పించడంతో విద్యార్థులు మెరుగైన విద్యను అభ్యసించి మంచి ఫలితాలు సాధించగలిగారని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో..

నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాలకు చెందని 18 మంది ట్రిపుల్ ఐటీల్లో సాధించారు. అనపర్తి బాలికల పాఠశాల చెందిన పాలి దేవి సత్యశ్రీ (ఒంగొలు), వేమగిరి కీర్తన (నూజివీడు), ఓగిరెడ్డి శ్రీసత్య సాయి (నూజివీడు), గుత్తుల ప్రసన్న సత్య (నూజివీడు), నరవా కీర్తన (నూజివీడు), మట్టపర్తి షణ్ముఖశ్రీ (శ్రీకాకుళం), లంకి మహాలక్ష్మి (శ్రీకాకుళం), నందం తేజశ్రీ (శ్రీకాకుళం) ప్రతిభ చూపారు.

- పులగుర్తు ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్.వసంత్ చరణ్, అనపర్తి బాలుర ఉన్నత పాఠశాల చెందిన కేబీ సత్యాన్విత దుర్గ (శ్రీకాకుళం), ఆర్.వెంకట రాధాకృష్ణ (ఒంగోలు), ఎస్.నాగశేఖర లక్ష్మీనాథ్ (ఇడుపులపాయ) సీట్లు సాధించారు.
- బిక్కవోలు ఉన్నత పాఠశాల విద్యార్థి దాసరి జయమణిమంగ (నూజివీడు) , కొంకుదురు ఉన్నత పాఠశాల చెందిన అంగర వెంకటలక్ష్మి (ఒంగోలు), పెదపూడి మండలం పెద్దాడ ఉన్నత పాఠశాల చెందిన ఎం.పవిత్ర (శ్రీకాకుళం), రంగంపేటకు చెందిన కోశెట్టి శ్యాంకుమార్ (నూజివీడు), టి.బాల సూర్య ప్రసన్న (శ్రీకాకుళం) సీట్లు సాధించారు.

మంచి ఉద్యోగం సాధిస్తా



శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటీలో సీటు రావడం సంతోషంగా ఉంది. పదో తరగతిలో 572 మార్కులు వచ్చాయి. మా నాన్న వీరకృష్ణ రైతు, అమ్మ సత్యకళ గృహిణి. వీరిద్దరూ ఎంతో కష్టపడి నన్ను చదివించారు. ఉన్నత చదువును అభ్యసించి, మంచి ఉద్యోగం సంపాదించడమే నాలక్ష్యం. తల్లిదండ్రులను బాగా చూసుకోవాలనే కోరిక.

– టి.బాల సూర్యప్రసన్న, రంగంపేట

ఇంజినీర్‌గా స్థిరపడాలన్నదే నా కోరిక



పదో తరగతిలో 576 మార్కులు సాధించి, పాఠశాల టాపర్‌గా నిలిచాను. శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. నా విజయం వెనుక ఉపాధ్యాయుల కృషి ఉంది. ఎంతో చక్కగా విద్యాబోధన చేశారు. పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించడానికి చిట్కాలు చెప్పారు. ఇంజినీర్‌గా స్థిరపడాలన్నదే నా కోరిక.

– ఎం.పవిత్ర, పెద్దాడ

భూముల రికార్డులు పరిశీలన

కోరుకొండ: మండలంలోని దేవదాయ ధర్మాదాయశాఖకు చెందిన సంస్థల భూముల రికార్డులను ఆ శాఖ ఏసీ వీవీ సుబ్బారావు పరిశీలించారు. మండలంలో 27 సంస్థలకు చెందిన 1,379.91 ఎకరాల భూములున్నట్టు ఆయన తెలిపారు. వీటిలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం భూములు అధికంగా ఉన్నాయన్నారు. కాగా.. కోరుకొండలోని స్వామివారి భూములకు రిజిస్ట్రేషన్, భూములను సాగు చేస్తున్న రైతులకు అన్నదాత సుఖీభవ, పంట నష్టపరిహారం పథకాలు వర్తింపు జరగలేదు. దీంతో దేవదాయశాఖాధికారుల రికార్డుల పరిశీలన చర్చనీయాంశంగా మారింది. ఈ కార్యక్రమంలో ఆ శాఖ అధికారులు వీఐ సత్యనారాయణ, వీవీ రెడ్డి పంతులు సత్రం ఈఓ లక్ష్మీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

10న బాబా ఆలయ గురువుకు సత్కారం

కోరుకొండ: గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఈ నెల 10వ తేదీన బూరుగుపూడి బాబా ఆలయ గురువు మామిడిపల్లి రామారావును సత్కరించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు కంటే నాగ కేశవరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి గురువు రామారావు శిష్యులు, బాబా భక్తులు హాజరు కావాలన్నారు.

యువజనోత్సవాల్లో గైట్ వలంటీర్

రాజానగరం: రాజస్థాన్‌లోని నవ్రస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు జరిగిన జాతీయ సాంస్కృతిక యువజనోత్సవాలలో స్థానిక గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థిని, ఎన్ఎస్ఎస్ వలంటీర్ ఫర్జానా ఆష్మీ మహ్మద్ రాష్ట్రం నుంచి పాల్గొనట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం డీ ధనరాజ్ తెలిపారు. ఆ కార్యక్రమానికి దేశంలోని 23 రాష్ట్రాల నుంచి 102 మంది హాజరయ్యారన్నారు. వారిలో ఒక తమ కళాశాల విద్యార్థి కావడం సంతోషంగా ఉందన్నారు.

అనుమతిచ్చింది గోరంత.. తరలించింది కొండంత

- 44 రోజుల పాటు నిరాటంకంగా మట్టి తరలింపు
- ఇంత జరుగుతున్నా పట్టించుకోని ఎమ్మెల్యే, అధికారులు
- వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: గోరంత అనుమతి తెచ్చి 44 రోజుల పాటు రాత్రి, పగలూ తేడా లేకుండా వందల టిప్పర్లతో మట్టిని తవ్వుకుంటుంటే స్థానిక భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మౌనంగా ఉన్నారని అధికారగణం పట్టించుకోకపోవడం దారుణమని అనపర్తి మాజీ శాసన సభ్యులు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి విమర్శించారు. గురువారం అనపర్తి పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగంపేట మండలం నల్లమిల్లి గ్రామంలోని జగన్నాథ సాగర్ చెరువులో ఇటీవల జరిగిన భారీగా మట్టి అక్రమ రవాణా చేస్తు కోట్ల ప్రజాధనాన్ని దోచుకుంటున్న వైనాన్ని పలుమార్లు ఆ ప్రాంతానికి వెళ్లి అక్రమ వ్యవహారాన్ని ప్రజలకు కళ్లకు కట్టినట్టు చూపించి అధికారులకు ఫిర్యాదు చేసినా కనీసం కదలికలేదన్నారు. జీవో 203 ప్రకారం చెరువుల్లో మీటర్ లోతు మాత్రమే పూడిక తీసి స్థానిక అవసరాలకు మాత్రామే వాడాలని నిబంధన ఉన్నా అక్రమార్కులు పూర్తిగా అతిక్రమించి సుమారు 15 అడుగుల మేర తవ్వేశారని ఆయన అన్నారు. అధికార పార్టీ నేతలు, మైనర్ ఇరిగేషన్‌శాఖలోని కొందరు అధికారులు కలసి తప్పుడు ఉత్తర్వులను ఆధారంగా పెట్టుకుని ఏకంగా మండలం దాటించి రంగంపేట మండలం నుంచి బిక్కవోలు మండలం పందలపాక గ్రామంలోని ప్రైవేటు లేఅవుట్‌కు సుమారు 3వేల టిప్పర్ల మట్టిని తరలించి కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని కొల్లగొట్టారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై తాను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. యథేచ్ఛగా మట్టి తరలిస్తున్న తరుణంలో గత వారం రోజుల నుంచి వర్షాలు అధికంగా కురుస్తుండడంతో మట్టి తవ్వకాలు నిలిపివేశారు. దీన్ని ఆదునుగా తీసుకుని అధికారులు మట్టి తవ్వకాలు నిలిపివేయాలంటూ ఉత్తర్వులు జారీ చేశారని కాని ఆ ఉత్తర్వుల్లో మట్టి తరలింపులో జరిగిన అక్రమాలు, నింబధనల ఉల్లంఘనలను ఎక్కడా ప్రస్తావించకపోవడం వల్ల ఇది పథకం ప్రకారం జరిగిన అవినీతిగా స్పష్టమైందన్నారు. వర్షం వల్ల ఆగిన తవ్వకాలను అధికారులు తామే నిలిపివేశామని ప్రకటనలు చేస్తు హడావుడి చేయడం విడ్డురంగా ఉందన్నారు. తాను చేస్తున్న ఆరోపణలను సోలో వీడియోలు అంటూ మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి జరిగిన అవినీతిపై మాత్రం స్పందించడం లేదని మండిపడ్డారు. జరిగిన ఈ భారీ అవినీతి వ్యవహారం పై సమగ్ర విచారణ జరిపించి, చర్యలు తీసుకోవాలని, లేదంటే న్యాయ పోరాటం చేయడానికి కూడా వెనుకాడేది లేదని డాక్టర్ హెచ్చరించారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



జి.మామిడాడలో లెగసి పాయింట్ వద్ద కొలతల సేకరణను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నరేంద్రరెడ్డి

పెదపూడి: వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో గ్రామాల పరిశుభ్రంగా ఉంచడానికి అందరు కృషి చేయాలని, తద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి అన్నారు. పెదపూడి, పెద్దాడ, గండ్రేడు, జి.మామిడాడ గ్రామాల్లో లెగసి పాయింట్లను గుర్తించి కొలతలు సేకరణ ప్రక్రియ గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా నరేంద్రరెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో హానికరమైన పదార్థాలతో కూడిన వ్యర్థాలను లెగిసి పాయింట్లుగా గుర్తించి వాటి పొడవు, వెడల్పు, లోతు కొలతలు సేకరించి, ఆ ప్రదేశంలో ఉండి పీఆర్ వన్ యాప్‌లో అప్లోడ్ చేస్తున్నామన్నారు. ఉన్నత అధికారుల ఆదేశాలపై కొలతలు సేకరణ చేపట్టమన్నారు. దీంతో మండలంలో వేల టన్నుల లెగసి వచ్చినట్టు గుర్తించామన్నారు. ఈ నివేదికలు ఉన్నత అధికారులు తెలియజేస్తున్నామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలపై తదుపరి చర్యలు చేపడుతామన్నారు. అలాగే వాతావరణ పరిస్థితులు నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలికుండా తగిన చర్యలు తీసుకోవాలని సచివాలయం కార్యదర్శులకు ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ మేడపాటి సత్యనారాయణరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివాజీ, సచివాలయం కార్యదర్శులు నాగేంద్ర, ఉషారాణి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు తనిఖీ



పందలపాకలో డంపింగ్ యార్డును తనిఖీ చేస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

బిక్కవోలు: మండలంలోని డంపింగ్ యార్డులను ఎంపీడీవో శ్రీనివాస్ గురువారం తనిఖీ చేశారు. కాపవరం, ఊలపల్లి, బిక్కవోలు, మెళ్లూరు, ఆరికరేవుల, పందలపాక గ్రామాల్లోని డంపింగ్ యార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాతూ ప్రస్తుతం వర్షాలు కురవడంతో గ్రామంలోని చెత్త ఎప్పటికి అప్పుడు డంపింగ్ యార్డు తీసుకురావడంతోపాటు, రోడ్డు మీదకు లేకుండా శుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల అధికారులు పాల్గొన్నారు. ఆయన పాటు ఈవోపీఆర్డీ జాన్ మిల్లన్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో పెరిగిన నీటి ప్రవాహం



బొబ్బిల్లంక - ములకల్లంక మధ్య గోదావరిలో ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న నీరు



మునగాలలో కొట్టుకుపోయిన రహదారి

- నదిలో తాత్కాలిక రోడ్డుకు గండి
- ములకల్లంకకు రాకపోకలు బంద్

సీతానగరం: గోదావరిలో నీటిమట్టం పెరగడంతో బొబ్బిల్లంక – ములకల్లంక గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఆ గ్రామాల మధ్య గోదావరిలో నిర్మించిన తాత్కాలిక వంతెనకు గండి పడింది. అలాగే ఆ రోడ్డుపై నుంచి నీరు ప్రవహిస్తోంది. గత ఏడాది గోదావరి వరద తగ్గుముఖం పట్టిన అనంతరం ఇరు గ్రామాల మధ్య గోదావరి పాయలో ఈ రోడ్డును ఏర్పాటు చేశారు. దీని మీదుగానే ఇరు గ్రామాల మధ్య రాకపోకలు కొనసాగుతున్నాయి. ఇప్పుడు గోదావరి నీటి మట్టం పెరగడంతో రోడ్డు బంద్ అయ్యింది. ములకల్లంక గ్రామస్తులకు రెండు మరపడవలు ఉన్నాయి. వరదల సమయంలో వాటిపైనే రాకపోకలు సాగిస్తారు. వరద ఉధృతి ఇంకా ఎక్కువైతే అధికారులు ఆ మరపడవలపై ప్రయాణం నిషేధించి, లాంచీలను ఏర్పాటు చేస్తారు.

మునగాలలో..

కోరుకొండ: మండలంలోని కాపవరం నుంచి సీతానగరం మండలం ముగ్గళ్లకు వెళ్లే రహదారిలో రాకపోకలు నిలిచిపోయాయి. మునగాల సమీపంలోని తోట కాలువ వద్ద గండి పడడంతో ఈ సమస్య ఏర్పడింది. స్థానిక రైతులు, ప్రయాణికులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మునగాలలో కాలువపై వంతెన నిర్మాణం జరుగుతోంది. దీంతో రాకపోకలకు ఇబ్బంది లేకుండా డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేశారు. అయితే అటుగా నీటి ప్రవాహం పెరగడంతో ఆ రోడ్డు కొట్టుకుపోయింది. సీతానగరం మండలానికి కోరుకొండ, శ్రీరంగపట్నం మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది.

నెలాఖరు లోపు వరినాట్లు పూర్తి చేయాలి



దోమాడలో కూలీలతో కలసి వరినాట్లు వేస్తున్న ఏపీ సత్యప్రసాద్

పెదపూడి: మండలంలో ఈ నెల 15వ తేదీలోపు వెదజల్లు విధానం, 31వ తేదీలోపు వరినాట్లు విధానంలో ఖరీఫ్ నాట్ల ప్రక్రియ పూర్తి చేయాలని మండల వ్యవసాయశాఖాధికారి నాసిక సత్యప్రసాద్ తెలిపారు. దోమాడ గ్రామంలో వరినాట్లు వేస్తున్న పొలాన్ని ఆయన గురువారం సందర్శించి కూలీలతో కలిసి కొంతసేపు వరినాట్లు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేశామన్నారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో 17,500 ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారన్నారు. రైతులు వ్యవసాయశాఖాధికారి సూచనలు, సలహాలు పాటించి సాగు పనులు చేపట్టడంతో అధిక దిగుబడి సాధించవచ్చాన్నారు. రైతులు ఆధునిక సాంకేతి పరిజ్ఞానంతో సాగు చేసి తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడి సాధించాలన్నారు. వరినాట్లు వేసే ప్రక్రియ ఈనెల 31తో పూర్తి చేయడంతో మూడో పంట అపరాలు సాగు చేసుకోడానికి అవకాశం ఉంటుందన్నారు. రైతులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు దేవగుప్తాపు శ్రీను, రైతులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి భారీ మూల్యం

- ఇంటికి తాళం వేసి, పక్కనే స్విచ్ బోర్డుపై పెట్టిన యజమానులు
- ఆ తాళం తీసుకుని బంగారం, నగదు దోచేసిన దొంగలు
- నామవరంలో ఘటన

రాజానగరం: కుటుంబ సమేతంగా తలుపులమ్మ లోవకు పయనమైన వ్యక్తులు చూపిన నిర్లక్ష్యం వారి ఇంటిలో దోపిడీకి ప్రధాన కారణమైంది. తలుపులమ్మ లోవకు వెళ్లి, తిరిగి వచ్చిన వారికి తమ ఇంటిలో దొంగలు ప్రవేశించి, దోచుకుపోయారని తెలిసి లబోదిబోమన్నారు. మండలంలోని నామవరంలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి స్థానిక సీఐ వీరయ్యగౌడ్ గురువారం ఇక్కడ మీడియాకు తెలిపిన వివరాలిలావున్నాయి. నామవరానికి చెందని రేలంగి లోవరాజు కుటుంబ సభ్యులతో కలిసి తలుపులమ్మ వారి దర్శనానికి బుధవారం ఉదయం లోవ వెళ్లారు. రాత్రి తిరిగి వచ్చేసరికి ఇంటి తలుపులు తెరచి ఉండటం చూసి, కంగారుగా లోనికి వెళ్లి చూస్తే, బీరువాలో దాచుకున్న 20 కాసుల బంగారు నగలు, రూ. 5 లక్షలు నగదు కనిపించలేదు. దీనితో గురువారం రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టారు. క్లూస్ టీమ్‌ని రప్పించారు. లోవకు వెళ్లే సమయంలో ఇంటికి తాళం వేసి, ఆ తాళాలను కూడా తీసుకువెళ్లకుండా ప్రధాన గుమ్మానికి చేర్చి ఉన్న స్విచ్ బోర్డు పై అలవాటు ప్రకారం పెట్టడమే ఈ చోరీకి ప్రధాన కారణంగా గుర్తించారు. స్విచ్ బోర్డుపై తాళం చెవులు పెట్టడాన్ని గమనించి వ్యక్తులు ఈ చోరీకి పాల్పడివుంటారని అనుమానిస్తున్నారు. తాళం తీసుకుని ఇంటిలోకి ప్రవేశించిన వ్యక్తులు బీరువాను ఇనుప చువ్వతో పెకలించి, దోపిడీకి పాల్పడ్డారు. కేసు దర్యాప్తులో ఉందని సీఐ తెలిపారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

బిక్కవోలు: బలభద్రపురం ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థులకు యూనిఫాం అందించారు. గురువారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముందుగా పాఠశాల పని చేసిన హెచ్ఎం కేవీ రాఘవులు, ఉపాధ్యాయలు బదిలీ వెళ్లడంతో వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ సబ్బెళ్ల పురోషోత్తమరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందించే సదుపాయాలు వినియోగించుకుని చక్కగా చదువుకోవాలన్నారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు చేసిన సేవలు కొనియాడారు. అనంతరం విద్యార్థులు యూనిఫారం అందించారు. సర్పంచి బుంగా రామారావు, మాజీ ఎంపీటీసీ నల్లమిల్లి వెంకట సుబ్బారెడ్డి, పాఠశాల హెచ్ఎం ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు కృషి



టీబీ ముక్త భారత్ అభియాన్‌లో ప్రజలతో ప్రమాణం చేయిస్తున్న వైద్యులు

అనపర్తి : క్షయ వ్యాధి సమూల నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలని కుతుకులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ డి.దుర్గాప్రసాద్ అన్నారు. గురువారం క్షయ వ్యాధి పై ప్రజలకు అవగాహన కల్పిస్తు రామవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మీనాక్షి, డాక్టర్ దుర్గా ప్రసాద్‌ల ఆధ్వర్యంలో కొప్పవరంలో ఇంటెన్సిఫైడ్ టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో 80 మందిని పరీక్షించి వారిలో 40 మందికి కళ్లె పరీక్షకు శాంపిల్స్ సేకరించారు.

పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం

రాజమహేంద్రవరం సిటీ: పాఠశాల ప్రాంగణాన్ని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని రాజమహేంద్రవరం గెయిల్ ఇండియా లిమిటెడ్ మేనేజర్లు వైవీఎస్ మూర్తి, అమ్ము కుమార్ శర్మ అన్నారు. నగరంలోని చున్నీలాల్ జాజూ రోటరీ మున్సిపల్ హైస్కూల్‌కు క్లీనింగ్, శానిటరీ మెటీరియల్‌ను గురువారం అందించారు. కార్యక్రమంలో గెయిల్ అధికారులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో సంక్షోభం



సాలి వేణు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు

సీటీఆర్ఐ: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలనూ కూటమి ప్రభుత్వం సంక్షోభంలోకి నెట్టి వేసిందని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాలి వేణు అన్నారు. రాజమహేంద్రవరంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను ఎత్తి చూపుతున్న మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను అవమానించేలా మాట్లాడటం కూటమి నాయకులకు సరికాదన్నారు. సాధారణ పులివెందుల ఎమ్మెల్యేకు ఎందుకంత భద్రత ఇవ్వాలని హోంమంత్రి మాట్లాడడం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా కేసులు బనాయించి, జైలుకు పంపించడం తప్పితే కూటమి ప్రభుత్వం చేస్తున్నదేమీ లేదన్నారు.